

అచ్చుగుద్దినట్టు



ఈరోజు కవలల దినం. ఏడాదిలో ఫిబ్రవరి రెండో నెల. ఆ నెలలో 22వ తేదీన కవలల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు..

ప్రత్యేక కథనం...6లో

పోలింగ్ కేంద్రాల్లో ఉన్న కార్యాలయాలకు రెండు రోజులు సెలవు

అమలాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన భవనాల్లో పనిచేస్తున్న అన్ని విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు పోలింగ్ ముందురోజు అనగా ఈ నెల 26, పోలింగ్ రోజు 27న సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, శాసనమండలి ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలుగా నిర్దేశించిన పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పోలింగ్ సజావుగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దేశవాళీ కోళ్లల్లో బర్డ్‌ఫ్లూ కేసులు వచ్చాయని వస్తున్న పుకార్లను నమ్మవద్దని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇంతవరకు బర్డ్‌ఫ్లూ కేసు నమోదు కాలేదని, కోళ్ల మరణాలు సంభవించలేదని వివరించారు. ఉడికించిన మాంసం, గుడ్లను నిస్సందేహంగా తినవచ్చునన్నారు. జిల్లాలోని 22 మండలాల పశుసంవర్ధక శాఖ అధికారులతో శుక్రవారం ఆయన జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించి అందరినీ అప్రమత్తం చేశారు. జిల్లాలో 41 ర్యాపిడ్ రెస్పాన్స్ టీములను ఏర్పాటు చేసి ప్రతీరోజు మోనటరింగ్ చేస్తున్నామన్నారు. పెద్దసైజు కోళ్ల ఫారాల్లో మాత్రమే కాకుండా ఇంటి వద్ద మేపే దేశవాళీ కోళ్లను కూడా నిత్యం పరిశీలించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. బర్డ్‌ఫ్లూపై ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురి కావద్దన్నారు.

అడ్డుకట్టలతో అలజడి



రైతుల్లో చర్చనీయాంశంగా 'అడ్డుకట్టలు'
దాళ్వా రక్షణకే అడ్డుకట్టలంటున్న అధికారులు
ఆక్వా వ్యర్థాలతో పైరుకు ప్రమాదమంటున్న రైతులు
అడ్డుకట్టల ఏర్పాటుకు అధికారుల కసరత్తు

రైతులకు మేలంటున్న అధికారులు..'ఆక్వా' ఉండగా ఎలా అంటున్న అన్నదాతలు

ప్రతి ఏటా దాళ్వా సీజన్‌లో వినబడే పదం అడ్డుకట్ట. ఒకప్పుడు దాళ్వాలో సాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పరిష్కార మార్గం అడ్డుకట్ట.. ఇది ఇప్పటికీ తన ఉనికిని కోల్పోలేదు. కాల్వల ఎగువ ప్రాంతాల్లో రైతులు సాగునీటిని అవసరానికి మించి చేలకు పారించి, వెంటనే మురుగుకాల్వల్లోకి దింపేస్తుంటారు. దీనివల్ల దిగువ ప్రాంతాలకు సాగునీటి ఎద్దడి ఏర్పడుతుంది. డ్రెయిన్స్‌లోని తాజా నీటిని అత్యవసర సమయంలో పొలాలకు మళ్లించి పైరును రక్షించుకునేందుకు అడ్డుకట్టలు ఉపయోగపడతాయి. డ్రెయిన్ల ఆయకట్టు, పరిమాణాలను అనుసరించి ఎక్కడెక్కడ డ్రెయిన్లపై అడ్డుకట్టలు వేయాలనేది అధికారులు నిర్ణయిస్తారు. అయితే అసలు సమస్య ఏమిటంటే ఆక్వా సాగు ముందు, అనంతరం అడ్డుకట్టల వల్ల ప్రయోజనాలు ఎలా ఉన్నాయని అధికారులు ప్రశ్నించుకోవాలి.

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆక్వా సాగు లేనప్పుడు డ్రెయిన్స్‌లో కేవలం పొలాల దిగుడు నీరే ఉండేది. అవసరానికి ఈ నీటిని తోడుకుని పైరును బతికించుకునేవారు. ఇప్పుడు ఆక్వా వ్యర్థ జలాలను డ్రెయిన్లలోకి దింపేస్తున్నారు. ఈ నీటిని చేలకు వాడుకుంటే పైరు ధ్వంసమయిన పరిస్థితిని రైతులు అనుభవించారు. డ్రెయిన్ల శివారులో అడ్డుకట్టల వల్ల దిగువ ప్రాంతాల పొలాల్లోకి వ్యర్థ జలాలు ప్రవహించే ప్రమాదం లేకపోలేదు. ఈ కారణంగా కొందరు రైతులు అడ్డుకట్టలను వ్యతిరేకిస్తున్నారు. అయితే మేజర్, మీడియం డ్రెయిన్లకు అడ్డుకట్టలు వేయడం ద్వారా సముద్రం పోటు సమయంలో ఉప్పునీరు పొలాల్లోకి రాకుండా నివారించవచ్చని మరికొందరు రైతులు అంటున్నారు. ఈ రెండు వాదనలలోనూ నిజం లేకపోలేదు. ఆఖరి సమయంలో పంటకు నీరందకపోతే అడ్డుకట్టలు ప్రమాదాన్ని అడ్డుకుంటాయన్న ముందస్తు ఆలోచనతో ఉన్నతాధికారులు అడ్డుకట్టల ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే మండలాల్లో రెవెన్యూ అధికారులు అడ్డుకట్టల ఆవశ్యకతపై రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. కూనవరం మేజర్ డ్రెయిన్‌పై కొన్నేళ్లు గా అడ్డుకట్ట ఏర్పాటు కొనసాగుతోంది. రంగరాజుకోడు, ఓల్డ్‌అయినాపురం మీడియం డ్రెయిన్లు, గొరగనమూడి, ఓల్డ్‌సమనస, న్యూసమనస తదితర మైనర్ డ్రెయిన్లపై అవసరాల మేరకు అడ్డుకట్టలు వేస్తున్నారు. ఇప్పుడు అడ్డుకట్టలపై రైతులు, అధికార్లలో చర్చ కొనసాగుతోంది.

అడ్డుకట్టల ఆవశ్యకత ఎంతైనా ఉంది



ఇప్పటికే దిగువ ప్రాంతాల పొలాలు సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. మార్చిలో ఈ పరిస్థితి మరింత తీవ్రమైతే అప్పటికప్పుడు చేసేది ఏమిటి?? అందుకే ముందుగానే డ్రెయిన్లకు అడ్డుకట్టలు వేయడం సరైన పరిష్కారం. డ్రెయిన్ల గ్రేడ్, ఆయకట్టు ప్రకారం రైతుల అభ్యర్థన మేరకు అడ్డుకట్టల నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఈ అంశంపై సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానంగా మేజర్ డ్రెయిన్‌కు అడ్డుకట్ట వేయకపోతే సముద్రం నీరు పంట పొలాల్లోకి ఇంకి, పైరు దెబ్బతినే అవకాశాలుంటాయి. నీటి సంఘాల పరిధిలో అడ్డుకట్టల ఏర్పాటుపై నిర్ణయాలు తీసుకోవాలి.

దంగేటి చిట్టిబాబు,
ఉప్పలగుప్తం నీటి పంపిణీ సంఘం చైర్మన్

నీరు ఆవిరి కాకుండా..

అడ్డుకట్టలు కేవలం డ్రెయిన్లలోని నీటిని పొలాల్లోకి మళ్లించుకోవడానికే కాదు. డ్రెయిన్‌లో నీరు సమృద్ధిగా ఉంటే పొలాల్లో తేమ నూరు శాతం నిల్వ ఉంటుంది. వంతుల వారీ విధానంలో పది లేదా పదకొండు రోజుల వ్యవధిలో ఆయా ప్రాంతాలకు నీరందుతుంది. ఈ వ్యవధిలో చేలల్లో నీరు ఆవిరై పోకుండా అడ్డుకట్టల వల్ల రక్షణ లభిస్తుంది. కాగా సాగునీటి సరఫరాపై రైతులకు ఆందోళన అవసరం లేదు.

శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈఈ



గొరగనమూడి మైనర్ డ్రెయిన్‌లో మేట వేసిన ఆక్వా వ్యర్థాలు (ఫైల్‌ఫొటో)

కోకోతో ఆదాయం

కోకో పంటకు అంతర్జాతీయంగా డిమాండ్
అంతర పంటగా కోకో సాగుపై రైతులు దృష్టి సారించాలి
కలెక్టర్ మహేష్‌కుమార్



కోకో ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

అమలాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కోకో పంటకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉందని రైతులు కొబ్బరిలో అంతర పంటగా కోకో సాగు చేపట్టడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చునని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం కోకో సాగు విలువ ఆధారిత ఉత్పత్తులపై రైతులకు అవగాహన సదస్సును ఉద్యాన శాస్త్రవేత్తలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోకో పంటకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉందన్నారు. కొబ్బరిలో అంతర పంటగా 50 శాతం పాక్షిక నీడలో పెరుగుతుందన్నారు. ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా కాఫీ, టీ తరువాత ఎక్కువగా కోకోను వినియోగిస్తున్నారన్నారు. కోకోను విరివిగా చాక్లెట్లు, పానీయాలలో మందులు, సౌందర్య సాధనాల తయారీలో వినియోగిస్తున్నారన్నారు. రానున్న ఏడాది సీజన్‌లో 1000 ఎకరాలు రెండో ఏడాది 2 వేల ఎకరాలు, మూడో ఏడాది 3వేల ఎకరాలు విస్తీర్ణాలలో దశల వారీగా సాగును పెంచనున్నట్లు తెలిపారు. దక్షిణ అమెరికాలో అమెజాన్ నదీ పరివాహక ప్రాంతాల్లో కోకో జన్మించిందన్నారు. ఉద్యాన శాఖ ఎకరాకు మొదటి ఏడాది మొక్కలు ఉచితంగా ఇవ్వడంతో పాటు రూ.4800, రెండో ఏడాది రూ.1600, నిర్వహణ ఎరువులు మూడో ఏడాది నిర్వహణ కోసం రూ.1600లు రాయితీ అందిస్తుందన్నారు. ఎకరాకు 200 మొక్కలు నిర్ణయించారన్నారు. ఈ మొక్కల నర్సరీని పెంచేందుకు అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొబ్బరి ఆయిల్ పామ్ తోటలలో అంతర పంటలుగా వేసుకుని రైతులు అదనపు ఆదాయం పొందవచ్చునన్నారు. శాస్త్రవేత్తలు ఎన్‌బీవీ చలపతిరావు కోకో సాగుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానాధికారి రమణ, రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అదుపునకు ప్రత్యేక టీమ్‌లు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణారావు

ఎస్పీ కృష్ణారావు

అంబాజీపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గంజాయి, మాదక ద్రవ్యాలు నిర్మూలనకు జిల్లాలో ప్రత్యేక టీమ్‌లను నియమించి పటిష్ట నిఘాను ఏర్పాటు చేసినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు చెప్పారు. అంబాజీపేటలోని సర్కిల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. తొలుత ఆయనకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ రుద్రరాజు భీమరాజు పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. పోలీస్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన సర్కిల్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసి గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే వీటి వల్ల కలిగే అనార్థాలపై పోలీస్ అధికారులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు విజిబుల్ పోలీసింగ్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అవగాహన, డ్రంక్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రత్యేకంగా ట్రాఫిక్‌కు పోలీసులను నియమించినట్లు చెప్పారు. జిల్లా కేంద్రం ఏర్పడినప్పటికి అమలాపురంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి మహిళా పోలీస్‌స్టేషన్, సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలు సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తుతెలియని ఫోన్ నెంబర్లు, తెలియని వారితో మాట్లాడటం వల్ల ఖాతాలలో ఉన్న సొమ్ము మాయం అవుతుందన్నారు. దీనిపై ప్రజలలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. నేరాలు, ప్రమాదాలు జరిగిన సమయాలలో గుర్తించే విధంగా ముఖ్య కూడలిలు, ప్రధాన కేంద్రాలలో దాతలు, ప్రజల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో 850కు పైగా కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే 224 మెట్రిక్ కెమెరాలు ఉన్నాయన్నారు. అనంతరం స్టేషన్‌లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్, సీఐ ఆర్.భీమరాజు, ఎస్‌ఐలు కె.చిరంజీవి, ఏ.చైతన్యకుమార్, శివకృష్ణ, జోషి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాత్విక్ సాయిరాజ్ తండ్రి మృతదేహానికి ప్రముఖుల నివాళి 7లో

పంచాయతీల చెత్త తరలింపుపై

కౌన్సిల్ సభ్యుల అభ్యంతరం



డంపింగ్ యార్డులో అడ్డుకున్న బందారులంక పంచాయతీ ట్రాక్టరు

చెత్తాచెదారాలను డంపింగ్ చేస్తే సహించేది లేదు
ఏకగ్రీవంగా వ్యతిరేకించిన మున్సిపల్ కౌన్సిలర్లు
పంచాయతీ ట్రాక్టర్లను అడ్డుకున్న స్థానికులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణ పరిసర గ్రామాల్లోని చెత్తా చెదారాలను స్థానిక డంపింగ్ యార్డుకు తరలించడాన్ని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవంగా వ్యతిరేకించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణ పరిసర గ్రామాలైన బందారులంక, కామనగరువు పంచాయతీల నుంచి చెత్తా, చెదారాన్ని అమలాపురం డంపింగ్ యార్డుకు తరలించగా ఆ వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానికులు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. చేసేది లేక తిరిగి చెత్తతోనే ట్రాక్టర్లు వెనుదిరిగాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కోఆప్షన్ సభ్యులతో కలిసి మున్సిపల్ కౌన్సిలర్లు అందరూ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజును కలుసుకున్నారు. చెత్త సమస్యపై కమిషనర్‌తో చర్చించిన అనంతరం అమలాపురం కుమ్మరికాల్వ చెంతన ఉన్న డంపింగ్ యార్డు ప్రాంతానికి చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణితో కలిసి చేరుకున్నారు. నిత్యం రావణకాష్టంలా మండుతున్న చెత్తా, చెదారాలను పరిశీలించారు. ఇప్పటికే అమలాపురం పట్టణంలోని చెత్తను డంపింగ్ చేయడం, దాన్ని ఎప్పటికప్పుడు తగలబెట్టేస్తుండడంతో స్థానికంగా ఉన్న 27, 28, 29 వార్డుల ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికార, విపక్ష కౌన్సిలర్లు సంసాని బులినాని, యేడిద శ్రీను, మట్టపర్తి నాగేంద్ర, దొమ్మేటి రాములు వివరించారు. వ్యర్థాల నుంచి వచ్చే పొగతో ప్రజలు శ్వాసకోశ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నట్టు కౌన్సిలర్ రామకృష్ణ పేర్కొన్నారు. చెత్త తరలింపును అడ్డుకునేందుకు శనివారం నుంచి స్థానికులతో కలిసి ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. చెత్త సమస్యను ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, అబ్బిరెడ్డి చంటి, ఆశెట్టి ఆదిబాబు, పిండి రాజాలు తెలిపారు. సుదీర్ఘకాలంగా ఉన్న డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఇందుకోసం పట్టణానికి సమీపంలో భూమిని సేకరించాలని కోరారు. ఇదిలా ఉండగా అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాల్లోని చెత్తా చెదారాన్ని అమలాపురం డంపింగ్ యార్డుకు తరలించి సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంటు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఈ నెల 15న కలెక్టరేట్‌లో పంచాయతీ అధికారులతో జరిగిన సమావేశంలో పేర్కొన్నారు. చెత్తా, చెదారాలను తరలించే అంశంపై ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, మున్సిపల్ కమిషనర్లకు పలు సూచనలు ఆయన చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో చెత్త సమస్య ఎక్కడికి దారి తీస్తుందో తెలియడం లేదు. పట్టణానికి సమీపంలో ఉన్న గ్రామాల్లో డంపింగ్ యార్డులు లేకపోవడంతో ప్రజలు చెత్త కుప్పలతోనే జీవనం సాగిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే చెత్తను తగలబెట్టేస్తూ ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. చెత్త సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



డంపింగ్ యార్డు స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ నాగేంద్రమణి, కమిషనర్ రాజు, కౌన్సిలర్లు

అచ్చు గుద్దినట్టు..



నేడు కవలల దినోత్సవం

ఈరోజు కవలల దినోత్సవం. ఏడాదిలో ఫిబ్రవరి రెండో నెల. ఆ నెలలో 22వ తేదీన కవలల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతోంది. ప్రముఖ మెజీషియన్ చొక్కాపు వెంకట రమణ దీన్ని ట్విన్స్ డేగా ప్రకటించ డంతో అప్పటి నుంచి ఇది కవలల దినోత్సవంగా మారింది. సాధారణంగా కవలల్లో ఇద్దరూ ఆడ లేదా మగ పుడతారు. అరుదుగా ఒక ఆడ, ఒక మగ పిల్లలూ జన్మిస్తారు. ఒకే రంగు, రూపు, ఎత్తు, జుట్టు ఇలా శరీర నిర్మాణపరంగా 90 శాతం పైగా ఒకేలా ఉంటూ చూపరులను గందరగోళ పరుస్తారు. కుటుంబీకులు సైతం తికమక పడేలా అచ్చుగుద్దినట్టు కొందరుంటారు. ఇలా విశేషమైన ఒకే తీరు లక్షణాలతో జన్మించిన కొందరి పరిచయం ఇలా..

దివాన్‌చెరువుకు చెందిన కవలలు మట్ట ప్రవణశ్రీ, ప్రజ్ఞశ్రీ

ఇద్దరూ.. ఒకేలా..

అచ్చం ఒకరిని పోలి ఒకరు.. రూపం ఒకటే కానీ వ్యక్తులు ఇద్దరు. దివాన్‌చెరువుకు చెందిన మట్ట దుర్గారావు, దుర్గాప్రసన్న దంపతులకు ప్రజ్ఞశ్రీ, ప్రవీణశ్రీ కవలలుగా జన్మించారు. వీరు ఇద్దరూ అచ్చం ఒకరిని పోలి ఒకరు ఉంటారు. ప్రస్తుతం తమ కుమార్తెలు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారని తండ్రి దుర్గారావు తెలిపారు. తమ కుమార్తెలను గుర్తించేందుకు బయటి వ్యక్తులు తికమక పడుతుంటారని ఆయన చెప్పారు.

- దివాన్‌చెరువు



అంబాజీపేట జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న కవలలు

అంబాజీపేట గ్రామానికి చెందిన వర్షిణి, హర్షిణి ఇద్దరు కవలలు. వీరిద్దరు అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నారు. అలాగే మాచవరం గ్రామానికి చెందిన సాయిచరణ్, భువనేశ్వరి ఇద్దరు కవలలు. వీరు కూడా ఇదే హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నారు. ఇక్కడే ఎనిమిదవ తరగతి చదువుతున్న అంబాజీపేటకు చెందిన కవలల ధరణి, దర్శినిలు ఎప్పుడూ ఒకే రకం దుస్తులతో కనిపిస్తారు. దాంతో వారిని పోల్చుకోవడం కష్టమే. ఏడో తరగతి చదువుతున్న బెరీషా, బెహర్నాలది అంబాజీపేట.

- అంబాజీపేట



తికమక..మకతిక..

వీరు మాచవరం శివారు పోతాయిలంకకు చెందిన కోట రామకుమార్, కోట రాకేష్‌లక్ష్మణ్ 1995లో జన్మించారు. వారద్దరినీ ఒకేసారిచూస్తే బంధువులు, స్నేహితులు గుర్తుపట్టలేక తికమకపడుతుంటారు.



సత్య రితిక్, సత్య రూపక్

రూపమే కాదు.. గుణాలు ఒకటే!

కవలలైన తమ పిల్లలు రూపంలోనే కాదు.. గుణగణాల్లోనూ ఒకేలా ఉంటారని కె.గంగవరం మండలం కోటిపల్లి గ్రామానికి చెందిన కొండేపూడి బుల్లిరాజు, సూర్యకుమారి దంపతులు చెప్పారు. ఒక్కోసారి తమ పిల్లలను గుర్తించే విషయంలో తాము కూడా పొరబడుతుంటామన్నారు. ప్రస్తుతం వీరు కోటిపల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. - కె.గంగవరం



వర్షిణి.. వర్ధిణి

వీరు కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన టీడీపీ నాయకుడు గుబ్బల మూర్తి కుమార్తెలు వర్షిణి, వర్ధిణి. వీరిద్దరూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. - కొత్తపేట





- కరప

ఒకే రూపు.. అదే తీరు.. భలే పేర్లు!

కరప మండలం పాతర్లగడ్డ గ్రామానికి చెందిన పులపకూర వెంకటరమణ, ఝాన్సీరాణి దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరికి ఐదేళ్ల వయసున్న ఇశితాప్రియ, ఇన్వితాప్రియ అనే కవల పిల్లలు ఉన్నారు. కరప గ్రామానికి చెందిన రెడ్డి వీరవెంకటసత్యనారాయణ (వీరబాబు), సూర్యకుమారి దంపతులకు 11 ఏళ్ల కింద ఒక మగ, ఒక ఆడబిడ్డ జన్మించారు. వీరికి తన తల్లిదండ్రులు వీరవెంకట సత్యనారాయణ, సూర్యకుమారి పేర్లు పెట్టుకున్నారు. తాతనానమ్మ, తల్లిదండ్రులు, మనవళ్ల పేర్లు ఒక్కటే కావడం ఇక్కడ విశేషం.

ఒకే ఊరిలో 110 మంది కవలలు

బావి నీరు కారణమంటున్న దొడ్డిగుంట వాసులు



ఇది చదివాక.. కవలల పుట్టినిల్లు అనాలేమో. రంగంపేట మండలం పెద్దదొడ్డిగుంటలో ఏకంగా 110 కవల జంటలు జన్మించారు. దీనికి కారణం తమ ఊరిలో ఉన్న బావినీరే కారణమని చెబుతారు. 150 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ బావి నీటిని తాగితే కవలలు పుడతారని ప్రతీతి. దీంతో ఈ గ్రామస్తులేకాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి కొత్తగా పెళ్లయిన జంటల నుంచి, పిల్లలు లేని దంపతుల వరకు ఈ బావి నీటిని తాగుతున్నారు. ఇరవై ఏళ్ల కిందట బండి శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడు జనాభా లెక్కలు రాసుకునేందుకు వచ్చి, గ్రామంలో ఇంతమంది కవలలు ఉన్నారేంటని ఆశ్చర్యపోయారు. ఆ బావి నీటి వల్లే కవలలు పుట్టారంటూ గ్రామస్తులు తెలిపారు. అయితే ఉపాధ్యాయుడు ఆ మాటలను నమ్మలేదు. కొంతకాలం తర్వాత ఆ ఉపాధ్యాయుడు అదే గ్రామానికి బదిలీపై వచ్చారు. అప్పటికే వారికి బాబు ఉండగా, ఆ బావి నీరు ఆ దంపతులు తాగడంతో ఇద్దరు కవల ఆడపిల్లలు పుట్టారని, అప్పటి నుంచి ఇది బాగా ప్రాచుర్యంలోకి వచ్చినట్టు దొడ్డిగుంట గ్రామస్తులు తెలిపారు. ఏదిఏమైనా ఆ గ్రామంలో అంతమంది కవలలు ఉండడం విశేషమే కదా మరి. - రంగంపేట





అరె..టేనా!

ఓను.. అందానికే..తినడానికి పనికిరాదు

అబ్బురపరుస్తున్న ఇండోనేషియా రకం

అరెటేనా..ఇంకేమైనానా..ఏంటిది..ఇంత గెల.. సాధ్యమా..అని ఆశ్చర్యపోతున్నారా..! సాధ్యమే.. ఈ అరటి గెల ఎక్కడ ఉందో చూడాలంటే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద సంఘమేశ్వరం వెళ్లే రోడ్డులో ఉన్న సాయి రాఘవేంద్రనర్సరీకి వెళ్లాల్సిందే.. ఆ నర్సరీ రైతు మార్ని సత్యనారాయణరావు ఇండోనేషియా దేశానికి చెందిన అరటిని సాగుచేస్తున్నారు.దీనిపేరు థౌజండ్ ఫింగర్స్.ఈ అరటిగెల కనిపించడానికి భారీగానే కనిపిస్తుంది కానీ తినేందుకు పనికిరాదండోయ్.. అందంగా పెంచుకోవాల్సిందే..ఆ గెలను చూస్తూ ఆనందించాల్సిందే.. ఈ చెట్టు గెలకాసేందుకు 11 నెలల సమయం పడుతుంది.గెల మొత్తం పూర్తవ్వడానికి నాలుగు నెలలు పడుతుందని ఆయన చెప్పారు.నర్సరీలో వేసిన అరటి గెల పొడవు మూడు మీటర్లు, గెల చుట్టు కొలత అరమీటరు ఉందని తెలిపారు. ఈ గెలను విదేశాల్లో పెళ్లిళ్లకు అందకోసం వాడతారని ఇదేగెల ఇండోనేషియాలో రూ.15వేలు వరకు ధర ఉంటుందన్నారు.నేలపై కూడా గెల వేసి అబ్బురపరుస్తున్న అందరినీ అబ్బుర పరుస్తుంది. - మండపేట

9 నుంచి నరసన్న కల్యాణోత్సవాలు

కోరుకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు వచ్చే నెల 9వ తేదీ నుంచి ఆరంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం ప్రత్యేక ఆకర్షణ. ప్రతి ఏడాది సుమారు లక్ష మంది వరకు భక్తులు రథోత్సవంలో పాల్గొంటారు. స్వామి వారి రథంపై అరటి పండ్లు వేయడం ఇక్కడ సంప్రదాయం. పరాసర రంగరాజ భట్టర్, పరాసర లక్ష్మి నరసింహభట్టర్, పెద్దింటి, పెరవలి, పెదపాటి అను వంశక అర్చకస్వాములు వేద మంత్రోచ్చరణల మధ్య గ్రామస్తులు స్వామి వారి అతిపెద్ద రథాన్ని రథశాల నుంచి బయటకు తీశారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.ఆర్ అండ్‌బీ,పోలీసు,అన్నవరం దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం అధికారులు సూచనల మేరకు రథానికి మరమ్మతులను చేపడుతున్నారు.రథాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ఆర్ అండ్‌బీ అధికారులు రథం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసిన తరువాత రథాన్ని వినియోగిస్తారు.రాజమహేంద్రవరం నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ రథాన్ని పరిశీలించారు.



కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ విజయవంతంగా ముందుకు సాగుతోంది. ప్రతి మ్యాచ్ హోరాహోరీగా జరుగుతోంది. శుక్రవారం జరిగిన అన్ని మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లకు సంబంధించి మొత్తం 8 మ్యాచ్‌లు జరిగాయి. హాకీ టోర్నమెంట్ కన్వీనర్ రాజ్‌కుమార్, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

సై



హోరాహోరీగా హాకీ పోటీలు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ మహిళ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ 15-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, కేరళ సెక్రటేరియట్ మహిళా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్ 22-0 తేడాతో విజయం సాధించింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్టు 6-2 తేడాతో విజయం సాధించింది. ఆర్‌ఎస్బీ కాన్పూర్, ఆర్‌ఎస్బీ జైపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్బీ కాన్పూర్ 4-2 తేడాతో గెలిచింది. ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఆర్‌ఎస్బీ కొచ్చి, ఆర్‌ఎస్బీ ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్బీ కొచ్చి 5-0 తేడాతో విజయం సాధించింది. ఆర్‌ఎస్బీ హైదరాబాద్, ఆర్‌ఎస్బీ భువనేశ్వర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్బీ హైదరాబాద్ 5-0 తేడాతో విజయం సాధించింది.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం



వివిధ రాష్ట్రాల క్రీడాకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

హాకీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించాం

షాన్‌మోహన్, కాకినాడ జిల్లా కలెక్టర్



హాకీ టోర్నమెంట్ నిర్వహణ అంతా సంతృప్తికరంగా సాగింది. కాకినాడ వేదికగా మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్లు జరగాలి. మొట్టమొదటి సారిగా నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు వచ్చి పాల్గొన్నారు. పూర్తిస్థాయిలో విజయవంతమయ్యాం. మన జాతీయ క్రీడ హాకీ కోసం క్రీడాకారులను ఈ టోర్నమెంట్ ద్వారా ముందుకు తీసుకెళ్లాం. అసోసియేషన్ మెంబర్స్‌తో మరెన్నో టోర్నమెంట్లు నిర్వహించుకోవడానికి సిద్ధపడతాం.

స్థానిక యువత తిలకించేందుకు రావాలి

మల్లిబాబు, ఆర్డీవో



జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్ కాకినాడ వేదికగా జరుగుతోంది. మ్యాచ్‌లు చూడడానికి స్థానిక యువత, ప్రజలు ఆసక్తి కనబరచాలి. క్రికెట్‌కు ఉన్న క్రేజ్ హాకీకి లేకపోవడంతో తిలకించేందుకు ఎవరూ రాకపోవడం బాధాకరం. ఫైనల్ మ్యాచ్ అయినా తిలకించేందుకు స్థానిక యువత రావాలి. కలెక్టర్ షాన్‌మోహన్ ఎక్కడా రాజీపడకుండా ఏర్పాట్లు చేశారు.

స్నేహపూర్వక వాతావరణం కోసం క్యాంప్ ఫైర్

వి.రవిరాజు, టోర్నమెంట్ కోఆర్డినేటర్,



సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్ మొట్టమొదటిసారి మన కాకినాడలో జరగడం చాలా సంతోషం. కలెక్టర్ షాన్‌మోహన్ కృషితోనే ఇదంతా సాధ్యమైంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య స్నేహపూర్వక వాతావరం కోసమే ఈ క్యాంఫైర్ ఏర్పాట్లు. 2028లో నిర్వహించనున్న అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్‌కు కాకినాడ వేదిక కావాలని ఆశిస్తున్నాను. ఈ టోర్నమెంట్‌కి 15మంది టెక్నికల్ అఫీషియల్స్‌ను, 30మంది పీడీలను ఆంధ్రప్రదేశ్ నుంచి రిక్రూట్ చేసుకుని మ్యాచ్‌లు నిర్వహిస్తున్నాం.

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి)



ఉల్లాసంగా..

జిల్లా క్రీడా మైదానంలో క్యాంప్ ఫైర్.. క్రీడాకారుల నృత్యాలు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో భాగంగా జిల్లా క్రీడా మైదానంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన క్యాంప్ ఫైర్ ఉత్సాహంగా సాగింది. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్, వివిధ ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. బాణసంచా వెలుగులు ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేశారు.



ఆహా..ఏమి రుచి

క్రీడాకారులకు పసందైన విందు



కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ సందర్భంగా శుక్రవారం క్రీడాకారులకు పసందైన విందు ఏర్పాటు చేశారు. శాకాహార, మాంసాహార వంటకాలను సిద్ధం చేశారు. ప్రముఖ చెఫ్ టి.బాలాజీ సౌరథ్యంలో ఘుమఘుమలాడే వంటకాలు తయారు చేశారు. చిట్టిముత్యాల బిర్యానీ, రొయ్యలు ఫ్రై, రొయ్యల కర్రీ, చేప పులుసు, నెత్తళ్ల ఫ్రై, అపోలో ఫిష్ లాంటి నాన్‌వెజ్ రకాలతో పాటు పన్నీర్ బటర్ మసాలా, బంగాళదుంప మిల్‌మేకర్ కర్రీ, బూందీ ములక్కాడ జీడిపప్పు కర్రీ, పప్పు మామిడికాయ కర్రీ, బీట్‌రూట్ రసం, సాంబారు లాంటి వెజ్ కర్రీలు..చిల్లీ మంచూరియా, మష్రూమ్ జీడిపప్పు, వెజ్‌స్ప్రింగ్ రోల్స్, పీనట్ మసాలా, తందూరి రోటీ వడ్డించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులతో పాటు ఇతర అధికారులు, క్రీడాకారులు విందుకు హాజరయ్యారు.

వాహనదారులు అలెర్ట్



మోటారు వాహన చట్టంలోని నిబంధనలు పక్కాగా అమలు చేసే దిశగా పోలీసు, రవాణాశాఖలు అడుగులు వేయబోతున్నాయి. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి. హెల్మెట్, సీటుబెల్ట్‌లు తప్పనిసరిగా ధరించేలా చూడాలని ప్రయత్నిస్తున్నాయి. లేదంటే భారీస్థాయిలో జరిమానాలు, శిక్షలు విధించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

- ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే
- మార్చి 1 నుంచి కఠినంగా అమలు
- ఉల్లంఘిస్తే జరిమానాలు, కేసులు

సామర్లకోట, ఆంధ్రజ్యోతి:
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిందే. ఇకపై ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతామంటే కుదరదు. హెల్మెట్ తప్పనిసరి. ఆపై అన్నిరకాల ధ్రువపత్రాలు ఉండాలి. నిబంధనలు పాటించాలి. లేకుంటే భారీ జరిమానాలు చెల్లించక తప్పదు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం(హైకోర్టు) ఆదేశాల మేరకు మార్చి 1 నుంచి ప్రభుత్వం గట్టిగానే చర్యలకు దిగనుంది. మోటారు వాహన చట్టాలను మరింత కఠినంగా అమలు చేసేందుకు రవాణా, పోలీసు శాఖలు సిద్ధమవుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాల మోత మోగించనున్నారు. చట్టాన్ని పట్టించుకోకపోతే లైసెన్స్‌లనూ రద్దు చేసేందుకు వెనకాడరు. ఇందుకు సంబంధించి పోలీసుశాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ప్రతి వాహనదారుడి వివరాలు అందులో ఉంటాయి. గతంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినవారు, చలానా కట్టనివారి వివరాలు అన్నీ అందుబాటులోకి వస్తాయి. దానికి అనుగుణంగా జరిమానాలు విధిస్తారు. ఈ నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండి నిబంధనలు పాటించాలి.



ప్రజల్లో మార్పు కోసమే..

రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా వాహనదారులకు నిత్యం అవగాహన కల్పిస్తున్నాం. మార్చి 1 నుంచి వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందే. గ్రామీణ ప్రాంతాలనుంచి ఓవర్‌లోడ్‌తో ఆటోలు ఏడీబీ రోడ్డు, కెనాల్‌రోడ్డు, పెద్దాపురం, పిఠాపురం రోడ్డుమీదుగా సామర్లకోట పట్టణంలోకి వస్తున్నాయి. దీనివల్ల రోడ్డుప్రమాదాల్లో గాయ పడిన వారి సంఖ్య పెరుగుతుంది. దీన్ని నియంత్రించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇకపై నిబంధనలు కఠినంగా అమలుచేస్తాం. మూడుకంటే ఎక్కువసార్లు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారి లైసెన్స్‌లు రద్దుకు సిఫార్సు చేస్తాం. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వ్యక్తులకు నెల రోజులపాటు శిక్షలు పడే అవకాశం ఉంది.

-అడపా గరగారావు, ట్రాఫిక్ ఎస్ఐ, సామర్లకోట

ఇప్పటి వరకూ అలా.. 1 నుంచి ఇలా..

హెల్మెట్ లేకుండా ప్రయాణానికి ఇప్పటివరకూ రూ.135 జరిమానా వేసేవారు. ఇకనుంచి రూ.1000 కట్టాల్సిందే. లైసెన్స్ లేకుండా బండి నడిపితే రూ.10వేలు వసూలు చేస్తారు. విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ సిబ్బందితో వాగ్వాదానికి దిగితే కేసులు నమోదు చేస్తారు. 90 రోజుల్లో జరిమానా చెల్లించకపోతే వాహనాన్ని సీజ్ చేస్తారు. వెనుక కూర్చునవారు హెల్మెట్ ధరించకపోతే రూ.1000 జరిమానా, వాహనానికి ఇన్సూరెన్స్ లేకుంటే రూ.1000, రెండోసారి పట్టుబడితే రూ.2000, భారీ సైలెన్సర్లతో సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడితే రూ.2000, అదే రెండోసారి దొరికితే రూ.4000, పరిమితికి మించి వాహనాల్లో ఎక్కించుకుంటే మనిషికి రూ.200 చొప్పున జరిమానా విధిస్తారు. మైనర్లు డ్రైవ్ చేస్తే రూ.1000, నిషేధం ఉన్న ప్రాంతాలో పార్కింగ్ చేస్తే రూ.1000 నుంచి రూ.2000, బైక్ రేసుల్లో పాల్గొంటే రూ.5000, అందులో దొరికితే రూ.10వేలు, తాగి వాహనం నడిపితే మూడు నెలలు జైలుశిక్షతోపాటు రూ.10వేలు జరిమానా విధిస్తారు. దీన్ని అమలు చేసేందుకు పోలీసు, రవాణా శాఖలు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నాయి.

కళాశాలల్లో ఫేర్‌వెల్ పార్టీలు నిషేధించండి

- ఏ కార్యక్రమమైనా సంప్రదాయబద్ధంగా ఉండాలి
- నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



కళాశాలల యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో ఫంక్షన్లు, ఫేర్‌వెల్ పార్టీలు, డీజేలు వంటి నృత్య ప్రదర్శనలు నిషేధించాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ఆదేశించారు. ఆదికవినన్నయ విశ్వవిద్యాలయంలో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లు శుక్రవారం నన్నయ వర్సిటీ నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆమెను కలిశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ కార్యక్రమమైనా సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. నాణ్యమైన విద్యను అందించేందుకే కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఉన్నాయన్నారు. కళాశాలలు ఆహ్లాదకర వాతావరణంలో ఉండాలన్నారు. రాష్ట్రంలోనే ఎక్కువ అనుబంధ కళాశాలలు నన్నయ వర్సిటీలో ఉన్నాయన్నారు. 390 అనుబంధ కళాశాలల్లో లక్షకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. అన్ని కళాశాలల్లో పరీక్షలు సక్రమంగా జరిగేందుకు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరా మోనటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. దాన్ని విశ్వవిద్యాలయం నుంచి అధికారులు పరిశీలిస్తారని చెప్పారు. దీనిద్వారా ఆయా కళాశాలల్లో పరీక్ష నిర్వహణ, పర్యవేక్షణ సులభతరం అవుతుందని అన్నారు. మారుమూల ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలను సందర్శించేందుకు అయ్యే ఖర్చు, సమయం కలిసి వస్తాయన్నారు. వీటిని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఆయాకళాశాలలపై ఉందన్నారు. దీనిపై కళాశాల ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. అర్హులైన అధ్యాపకులతో పూర్తిస్థాయిలో అన్నికళాశాలల్లో తరగతులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సీడీసీ డీన్ ఆచార్య కె.శ్రీరమేష్, పరీక్షల డీన్ ఆచార్య డి.కళ్యాణి పాల్గొన్నారు.

యువతిని వంచించిన వ్యక్తికి పదేళ్ల జైలు

ఐ.పోలవరం,ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి వంచించిన వ్యక్తికి కోర్టు పదేళ్ల జైలుశిక్ష విధించింది. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2019లో పశువుల్లంక సచివాలయంలో వాలంటీర్‌గా పనిచేస్తున్న యువతితో అక్కడే వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తాళ్లరేవు మండలం చిన్నగోవలంకకు చెందిన కాశి మధుబాబు ప్రేమ వ్యవహారం నడిపాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి వంచించాడు. బాధితురాలు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ సీహెచ్ రాజేష్ కేసు నమోదుచేయగా అప్పటి సీఐ జానకీరామ్ నిందితుడిని అరెస్టు చేశారు. వాదోపవాదనల తర్వాత నేరం రుజువుకావడంతో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం మహిళాకోర్టు జడ్జి బెన్నయ్య నాయుడు శుక్రవారం తీర్పుచెప్పినట్టు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ



ఆటోడ్రైవర్ రామకృష్ణ ను సన్మానిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

- ప్రయాణికురాలు మర్చిపోయిన నగల బ్యాగ్ పోలీసులకు అందజేత
- సత్కరించిన పోలీసులు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆటోలో వదిలివేసిన 10 కాసుల బంగారు నగలతో ఉన్న బ్యాగ్‌ను ఓ ఆటోడ్రైవర్ పోలీసులకు అప్పగించాడు. అతడి నిజాయితీకి ఫిదా అయిన కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అతడ్ని సన్మానించి సత్కరించారు.

కాకినాడ జిల్లా అన్నవరానికి చెందిన ఊర సుధ తన కుటుంబసభ్యులతో కలిసి గురువారం కాకినాడలోని బంధువుల వివాహానికి హాజరై శుక్రవారం తిరిగి అన్నవరం వెళ్లేందుకుగాను సర్పవరంలో దిగి ఆటోలో నగలతో ఉన్న బ్యాగ్‌ను మరిచిపోయింది. అనంతరం ఆటోలో బ్యాగ్ మరిచిపోయిన విషయాన్ని గ్రహించి సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనంతరం సర్పవరం ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఆటోను పెదపూడిలో గుర్తించి అక్కడి ఎస్ఐకు సమాచారం అందించారు. పెదపూడి ఎస్ఐ తన సిబ్బందితో ఆటో గురించి వెతుకుతున్న తరుణంలో ఆటోడ్రైవర్ ఎర్రంశెట్టి రామకృష్ణ తమ ఆటోలో వదిలివేసిన బ్యాగ్‌ను గుర్తించి పెదపూడి ఎస్ఐ రామారావుకు అందజేశాడు. అనంతరం నగలతో ఉన్న బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని సుధకు ఎస్పీ ద్వారా అందజేశారు. ఆమె పోలీసులకు, ఆటో డ్రైవర్ రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపింది.

ఇంటి బయటపెట్టిన బైక్ దగ్ధం



కాకినాడలో దగ్ధమవుతున్న మోటారుసైకిల్

- తెల్లవారు జామున తగులబెట్టిన అగంతకులు
- పాతకక్షల నేపథ్యంలో జరిగి ఉండొచ్చని అంచనా

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఇంటి బయటపెట్టిన మోటారుబైక్‌ను కొంతమంది అగంతకులు తగులపెట్టిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున కాకినాడలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ పాతబస్టాండ్ టీబీ ఆస్పత్రి వెనుక వీధిలో పెమ్మాడి అజయ్‌కుమార్ తన పల్సర్-150 మోటారుబైక్‌ను అతడి ఇంటి బయట పార్క్ చేసి నిద్రించాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో అగంతకులు మోటారుబైక్‌ను ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టి తగులపెట్టారు. వాహన యజమాని, స్థానికులు గమనించేసరికి బైక్ పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనకు కారణం 3 నెలల క్రితం స్థానికుడైన ధాలీ హత్యోదంతానికి ప్రతీకార చర్య అని స్థానికులు చెప్తున్నారు. ఈ ప్రాంతంలో గంజాయి సేవించిన ఆకతాయిలు తమను భయాందోళనలకు గురిచేస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ పంట బోదెలోకి దూసుకెళ్లి వ్యక్తి మృతి

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్‌ను అతివేగంగా నడపడంతో పంటబోదెలోకి దూసుకుపోయి రాయిని ఢీకొట్టిన ఘటనలో బైక్ వెనుక కూర్చొన్న గొలకోటి రమేష్(45) అక్కడికక్కడే మృతిచెందినట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు శుక్రవారం తెలిపారు. కొత్తపేట మండలం కండ్రి గ్రామ శివారు ఆర్లపల్లివారిపాలేనికి చెందిన రమేష్ తాపీ పనిచేసుకుని జీవిస్తున్నాడు. తన తోడల్లుడైన గునిశెట్టి సోమసుందరశేఖర్‌తో కలిసి మోటారుసైకిల్‌పై రాజోలు నుంచి అత్తవారి గ్రామమైన ఉప్పలగుప్తం బయలుదేరారు. మార్గమధ్యలో కామనగరువులోని రాజులపూడి భాస్కరరావు ఇంటి ప్రాంతానికి వచ్చేసరికి మోటారుసైకిల్ అదుపుతప్పి పంటబోదెలోకి దూసుకుపోయింది. రమేష్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మోటారుసైకిల్ నడుపుతున్న శేఖర్‌కు గాయాలు కావడంతో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

శవమై తేలాడు

అదృశ్యమైన యువకుడి మృతదేహం గోదావరిలో లభ్యం



గగ్గులోతు సాయితేజ(ఫైల్)

కొవ్వూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గోదావరినదిలో దూకి గల్లంతైన యువకుడి మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం గుర్తించారు. తూర్పుగోదావరిజిల్లా ఔరంగాబాద్ ఇసుకర్యాంపు సమీపంలో గురువారం రాత్రి మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈనెల 19న రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కొవ్వూరు మండలం దొమ్మేరుకి చెందిన గగ్గులోతుసాయితేజ(25)అదృశ్యమయ్యాడు. గోదావరిలో మృతదేహం లభ్యం కావడంతో సాయితేజది అని నిర్ధారించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసును మార్పు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ సాంబమూర్తి తెలిపారు.

కొట్టేసిన చోటే కుదువ పెట్టి..

- కెనరా బ్యాంకులో ఘరానా మోసం
- గోల్డ్ అప్రైజర్ చేతివాటం
- ఖాతాదారుల ఆందోళన



కుదువ పెట్టిన బంగారం కోసం పడిగాపులు కాస్తున్న ఖాతాదారులు

తుని రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తేటగుంట కెనరా బ్యాంకులో బంగారం గోల్‌మాల్ సంచలనం రేకెత్తించింది. గోల్డ్ అప్రైజర్ చేతివాటంతో 150కి పైబడి ఖాతాదారుల బ్యాంకులో కుదువ పెట్టిన బంగారు ఆభరణాలు మాయం కావడంతో ఖాతాదారులు కంగుతిన్నారు. దీంతో పెద్దఎత్తున ఖాతాదారులు బ్యాంకువద్ద ఆందోళనకు దిగగా బ్యాంకు ఉన్నతాధికారులు రంగంలోకి దిగి వారికి సర్ది చెప్పే పనిలోపడ్డారు. విచారణ చేపట్టిన అధికారులు ఇంటి దొంగల పనిగా తేల్చేశారు. అదే బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న మేనేజర్‌తోపాటు అసిస్టెంట్ మేనేజర్‌ను సస్పెండ్ చేశారు. అక్రమాల్లో సూత్రధారిగా ఉన్న గోల్డ్ అప్రైజర్‌పై తుని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఆశ్చర్యపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతమైన తేటగుంటలో ఏర్పాటు అయిన కెనరా బ్యాంకులో సగానికి మించి ఖాతాదారులు రైతు కుటుంబీకులే. ఇదే అదునుగా భావించి గోల్డ్ అప్రైజర్ ఏడాదికొకసారి గోల్డ్‌లోన్ రెన్యువల్ చేసే క్రమంలో సంబంధిత ఖాతాదారుడి గోల్డ్ ప్యాకెట్‌నుంచి ఒకటి రెండు బంగారు ఆభరణాలు కాజేసి అదే బ్యాంకులో తన కుటుంబసభ్యుల ఖాతాల పేరిట కుదువ పెట్టి కాసులు కొల్ల కొట్టినట్లు విచారణలో బయటపడింది. గోల్డ్ గోల్‌మాల్ జరిగిందన్న సమాచారంతో పెద్దఎత్తున బంగారం కుదువ పెట్టిన ఖాతాదారులు ఆందోళనకు దిగారు. వారి బంగారానికి బ్యాంకే గ్యారెంటీ అని అధికారులు చెప్తున్నా బ్యాంకు బయట వారంతా ఆందోళనకు దిగుతున్నారు.

పాఠశాలలో ఇన్‌ట్రాక్టివ్ ప్లాట్ ప్యానల్ చోరీ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం తాళ్లపొలంలో ఎంపీపీయుపీ ఉన్నత పాఠశాలలో ఇన్‌ట్రాక్టివ్ ప్లాట్ ప్యానల్ చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలను శుక్రవారం తెరిచేసరికి ఐఎఫ్‌పీ చోరీకి గురయినట్లు గుర్తించారు. హెచ్ఎం బొలిశెట్టి లక్ష్మణరావు ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించారు. రూ.లక్ష వరకు ఖరీదు చేసే ఐపీఎఫ్‌ను ఈనెల 10న చోరీ చేసేందుకు దొంగలు యత్నించారు. కటకటాల్లో ఇరుక్కుపోవడంతో వదిలిపోయారు. దీనిపై అప్పట్లో హెచ్ఎం ఫిర్యాదు చేశారు. దొంగలు మరోసారి ప్రయత్నించి చోరీ చేశారు.

తేనెటీగల దాడిలో ఆరుగురికి గాయాలు

కోటనందూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం కె.కొత్తూరులో మురుగుడు కాలువవద్ద శుక్రవారం ఉపాధి పనుల వద్ద తేనెటీగలు దాడి చేయడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కూలీలు పనులు చేస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో పండుగ రాజు, పండుగ అప్పారావు, సలాది నాగరత్నం, కోనాల సింహాచలం, గుడాల గొంతెమ్మ, కడితి నిర్మలకుమారికి గాయాలయ్యాయి. వీరిని కోటనందూరు పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యంకోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కాశీవిశ్వనాథం మృతి.. బ్యాడ్మింటన్‌కు తీరని లోటు



కాశీవిశ్వనాథం భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

- షటిల్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ గోపీచంద్
- సాత్విక్ సాయిరాజ్‌కు పలువురి పరామర్శ

అమలాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సీనియర్ వ్యాయామోపాధ్యాయుడు రంకిరెడ్డి కాశీ విశ్వనాథం మృతి రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్‌కు తీరని లోటని షటిల్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. తానొక మంచి ఆత్మీయుడిని కోల్పోయానన్నారు. గుండెపోటుతో కాశీవిశ్వనాథం మృతిచెందడంతో ఎంతో బాధను కలిగించిందన్నారు. శుక్రవారం అమలాపురం గాంధీబజార్‌లోని కాశీ స్వగృహం వద్దకు అంతర్జాతీయ క్రీడాకారులతో కలిసి వచ్చి ఆయన భౌతిక కాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తన శిష్యుడైన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్‌సాయిరాజ్‌ను ఆయన ఓదార్చారు. న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మకమైన ధ్యానచంద్ ఖేల్‌రత్న అవార్డును అందుకోవాల్సిన సాత్విక్ తండ్రి కాశీ మృతి సమాచారంతో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసుకుని రాత్రికి అమలాపురం చేరుకున్నారు. గోపీచంద్‌తోపాటు సాత్విక్ జోడి అయిన చిరాగ్‌శెట్టి, మరో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్, వెటరన్ క్రీడాకారుడు ఏవీఎస్ఎన్ మూర్తి, ఆకుల సునీల్, ఆకుల బాలాజీ తదితరులు కాశీ భౌతికకాయానికి నివాళులర్పించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాత్విక్‌తోపాటు కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. సాత్విక్‌కు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట స్థానిక నాయకులతోపాటు జవ్వాది తాతబాబు, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, పాయసం శ్రీనివాస్ పాల్గొని నివాళులర్పించారు. జాతీయ బ్యాడ్మింటన్ రిఫరీ అయిన కాశీ మరణం క్రీడారంగానికి తీరని లోటని మాజీ ఎంపీ పండుల రవీంద్రబాబు అన్నారు. మరణ వార్త తెలిసిన వెంటనే ఫోన్‌లో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాశీ తనకు మంచి మిత్రుడని, ఎంపీగా పనిచేసిన సమయంలో కాశీ ద్వారా క్రీడాభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టినట్టు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

మండపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన వ్యక్తి గతేడాది రెండు మోటారుసైకిళ్లను దొంగిలించిన కేసు రుజువు కావడంతో ఏడాది జైలుశిక్ష పడిందని మండపేట పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండపేట పట్టణం రథంవీధికి చెందిన మేకాశివశ్యామ్ గతేడాది సెప్టెంబరు 24న రెండు బైక్‌లు చోరీ చేసినట్టు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ఆలమూరు మున్సిప్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి నాగేశ్వరనాయక్ నిందితుడికి ఏడాది జైలుశిక్ష విధించారని ఎస్ఐ శాస్త్రి తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

మండపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలో పదో తరగతి బాలికపై అత్యాచారానికి పాల్పడిన సంఘటనలో నిందితుడిని ఈనెల20న అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ దారం సురేష్ తెలిపారు. ఈనెల 17న బాలికపై అత్యాచారానికి పాల్పడిన సంఘటనపై కేసు నమోదైందని ఆయన చెప్పారు. అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి ముప్పిడి క్రాంతికుమార్‌ను గురువారం అరెస్టు చేసి ఆలమూరు కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజులపాటు రిమాండ్ విధించారని తెలిపారు.

బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న బాలుడి అరెస్ట్

రూ.2.80లక్షల విలువైన ఆరు బైక్‌లు స్వాధీనం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో బైక్ చోరీలకు పాల్పడుతున్న బాలుడ్ని ఇంద్రపాలెం పోలీసులు అరెస్ట్ చేసి రూ.2.80 లక్షలు విలువ చేసే ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో పలుప్రాంతాల్లో జరుగుతున్న చైన్‌స్నాచింగ్, చోరీలకు పాల్పడుతున్న వారిని పట్టుకునే చర్యల్లోభాగంగా శుక్రవారం ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు సిబ్బందితో కలిసి చీడిగ ఫ్లైఓవర్ బ్రిడ్జివద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బైక్‌పై నుంచి పెదపూడి మండలం కరకుదురు గ్రామానికి చెందిన 17ఏళ్ల బాలుడు కాకినాడ వైపు వస్తోండగా బైక్ ఆపి తనిఖీ నిర్వహించారు. అనుమానంతో విచారించగా బైక్‌ల చోరీలకు పాల్పడిన విషయం బయటపడింది. ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బైక్, సామర్లకోట పీఎస్‌లో మూడు బైక్‌లు, కోరింగ, సర్పవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు బైక్‌లు వెరసి ఆరు బైక్‌లను నిందితుడినుంచి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వీరబాబు తెలిపారు. వీటి విలువ రూ.2.80లక్షలు ఉంటుందన్నారు. నిందితుడుపై ఉన్న పలు కేసుల్లో చేసిన నేరాలకుగాను డిస్ట్రిక్ట్ ప్రొబిషనరీ ఆఫీసర్ ముందు హాజరు పరిచామన్నారు. నిందితుడ్ని పట్టుకుని చోరీసొత్తు రికవరీ చేసిన సీఐ, ఎస్ఐ, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

శివరాత్రి ఉత్సవాలపై ఆర్డీవో మాధవి సమీక్ష

కాట్రేనికోన, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మగసాని తిప్పలో ఉన్న కాలభైరవ స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై శుక్రవారం ఆర్డీవో కె.మాధవి సమీక్ష జరిపారు. కాలభైరవ ఆలయంవద్ద డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె ప్రసాద్, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో సమీక్షా సమావేశంలో శివరాత్రి ఉత్సవ ఏర్పా ట్లుపై సమీక్ష చేశారు. ఆలయంవద్ద నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు తావులేకుండా ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్, ఎస్‌ఐ అవినాష్, తహసీల్దార్ సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీకనకదుర్గమ్మ వార్షికోత్సవం

పి.గన్నవరం, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం ప్రధాన రహదారి చెంతనే ఉన్న శ్రీలక్ష్మీకనకదుర్గమ్మవారి ఆలయ 30వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు రాంబాబు ఆచార్యులు ఆధ్వర్యంలో బుధవారం 108కలశాల పూజ నిర్వహించారు. గురువారం లక్ష కుంకుమార్చన, శుక్ర వారం చండీ హోమం నిర్వహించి దాతలు సహకారంతో మహిళలకు పసుపు, కుంకుమ, జాకెట్టు ముక్కలు, గాజులు అందించారు. అనంతరం భారీ అన్నసమా రాధన జరిగింది.

కొల్లాబత్తులపై ఫిర్యాదు

అల్లవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కొల్లాబత్తుల శివకుమార్, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని అల్లవరం పోలీసుస్టేషన్‌లో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, శెట్టిబలిజ నాయకులు ఫిర్యాదు చేశారు. బొక్కా శ్రీనివాసరావు, సర్పంచ్ కడలి గంగాచలం, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, శ్రీరామ్, సూర్యప్రకాశ్, వెంకటేశ్వరరావు, సాయిబాబు, రామారావు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యార్థులందరూ సత్ప్రవర్తన కల్గిఉండాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మం డలం విద్యార్థులంతా ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో మంచి గుర్తింపును తెచ్చుకోవాలని మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ పుణ్యమంతుల రజనీ సూచించారు. ఠాణేలంక సాంఘిక సంక్షేమసంఘ బాలికల గురుకుల పాఠశాల, అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు విద్య, దాని ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు.

కుంగిన డ్రైనేజీకి నిధులేవి?

- పి.గన్నవరంలో ఒక పక్క డ్రైనేజీకి రూ.70 లక్షల నిధులు
- రోడ్డు అభివృద్ధి పనుల్లో మరో పక్క కుంగిన డ్రైనేజీ
- వర్షం వస్తే చాలు అంతే సంగతులు


పి.గన్నవరం ప్రధాన రహదారి సీసీ రోడ్డు చెంతనే ఒక ప్రక్క డ్రైనేజీ దుస్థితి

పి.గన్నవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రధాన కేంద్రం పి.గన్నవరం- అంబాజీపేట ఏజీ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా పి.గన్నవరం సెంటర్ అమలాపురం వైపు పోలీసుస్టేషన్ వరకు సుమారు 975మీటర్ల సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఈక్రమంలో ఇప్పటికే శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా డ్రైనేజీ (ఇరువైపు లా) పలు చోట్ల మరింత కుంగిపోయింది. అంతే కాకుండా సీసీ రోడ్డు ఎత్తు పెరగడంతో డ్రైనేజీ పల్లంగా మారింది. దీంతో వర్షంవస్తే చాలు రోడ్డుపై నీరు నివాసాలు, షాపుల్లో చేరే అవకాశం ఉంది. గతంలో కూడా వర్షంవస్తే చాలు డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో పి.గన్నవరం ప్రధాన సెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు గోదావరిలా మారేది. కూటమి ప్రభుత్వం రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడంతో డ్రైనేజీ వ్యవస్థ మాత్రం ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్ నుంచి ఏజీ రోడ్డులో ఒక పక్క (ఎడమ) డ్రైనేజీ ఏర్పాటుకు ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేశారు. ఒకపక్క డ్రైనేజీ ఏర్పాటు చేస్తే సరిపోతుందా...మరో పక్క(కుడి) పక్క మాటే మిటని స్థానిక ప్రజానీకం, వ్యాపారస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇలాగైతే రాబోయే వర్షాకాలంలో రోడ్డుపై ఉన్న వర్షపునీరు సైతం షాపుల్లోకి, నివాసాల్లోకి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండోపక్క కూడా డ్రైనేజీ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఒక పక్క డ్రైనేజీ ఏర్పాటుకు రూ.70 లక్షలు

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కృషితో పి.గన్నవరం సెంటర్ నుంచి అమలాపురం వైపు సుమారు 500 మీటర్లు మేర డ్రైనేజీ ఏర్పాటుకు ఎంపీ హరీష్‌మాధూర్ ఎంపీ ల్యాండ్స్ నిధులు రూ.70లక్షలు మంజూరు చేసినట్లు పంచాయతీ రాజ్ డీఈ అన్యం రాంబాబు తెలిపారు. మీటరు వెడల్పుతో ఇరువైపులా కాంక్రీటు గోడతో డ్రైనేజీ ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్సీ కోడ్ తరువాత టెండర్లు పూర్తవుతాయని అనంతరం పనులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతమ్‌బాబు ప్రచారం

అల్లవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి కొల్లు గౌతమ్‌బాబు అల్లవరంలో గ్రాడ్యుయేట్‌లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తానని, మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


తొత్తరమూడిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

అయినవిల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరుగనున్న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా అయినవిల్లి మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ శుక్రవారం పరిశీలించారు. తొత్తరమూడిలోని పోలింగ్ కేంద్రం నెం.198, 199లను ఆయన పరిశీలించి రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఐ.పోలవరం: మండలంలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ చిక్కాల విజయశ్రీ శుక్రవారం పరిశీలించారు. మండలంలో 2500 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నట్టు ఆమె తెలిపారు. నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఐ.పోలవరం హైస్కూల్లో రెండు కేంద్రాలు, ఎంపీడీవో కార్యాలయం, పంచాయతీల్లో ఒక్కొక్క కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో డీప్యూటీ తహసీల్దార్ మహాలక్ష్మీనాయుడు, పంచాయతీ కార్యదర్శి జీవీఎస్ఎన్ మూర్తి, హెచ్‌ఎం వీధి సురేష్ బాబు పాల్గొన్నారు.

నేడు ఉమెన్ పోలీసులతో బైక్ ర్యాలీ

అమలాపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బేటీ బచావో బేటీ పడావో ద్వారా ఆడపిల్లల లింగ నిష్పత్తి సాధికారతను సాధించడమే లక్ష్యంగా శనివారం స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయం వరకు మహిళాశిశు సంక్షేమ శాఖ ఉమెన్ పోలీసులతో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు బి.శాంతకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన ఈ కార్యక్రమం పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10గంటల నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.

పారిశుధ్య కార్మికుడిపై దాడికి నిరసన

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో పారిశుధ్య కార్మికుడు పొట్లూరు పైడిరాజుపై దాడికి పాల్పడ్డ ఘటనను నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో అమలాపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో దాడికి పాల్పడ్డ వ్యక్తిని చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు కొప్పుల సత్తిబాబుతోపాటు యూనియన్ నాయకులు పాల్గొని కమిషనర్ కేవీఆర్ఆర్ రాజుకు వినతిపత్రం అందజేశారు.

చైర్మన్ గణేష్‌కుమార్‌కు సత్కారం


గణేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అమలాపురంరూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్, కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు వీవీ గణేష్‌కుమార్‌ను శుక్రవారం బండారులంకలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో సత్కరించారు.

స్కూల్లో స్కౌట్ అండ్ గైడ్ శిక్షణ

ఐ.పోలవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరం ఉన్నత పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్ విభాగం ప్రారంభించినట్టు హెచ్‌ఎం వీధి సురేష్‌బాబు తెలిపారు. ఇటీవల జిల్లాస్థాయిలో 32 మంది విద్యార్థులు శిక్షణ తీసుకున్నారు. ఎంఈవో ఎన్.కొండారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు స్పోర్ట్స్ క్యాప్‌లు అందించారు.


కామనగరువులో ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు, బండారు శ్రీనివాస్


అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ రామారావు, ఎమ్మెల్యే సత్యనారాయణ

'రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలి'

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పార్లమెంట్ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం భట్నవిల్లి, కామనగరువ, రెడ్డిపల్లి, సమనస, వన్నెచింతలపూడి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మల్లుల పోలయ్య, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, నీటి సంఘం అధ్యక్షుడు రాజులపూడి వెంకటేశ్వరరావు(భీముడు), జనసేన నాయకులు నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, లింగోలు పండు, కంచిపల్లి అబ్బులుతో పాటు రాజులపూడి మహేశ్వరరావు, కామన గంగాధరరావు, కాట్రు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి తరపున పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరంను అత్యధిక మెజార్టీతో గెలిపించడంకోసం మొదటి ప్రాధాన్యత ఓటువేయాలని ఎమ్మెల్సీ, నియోజక వర్గ ఎన్నికల పరిశీలకులు దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయ ణ కోరారు. మండలంలోని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి వారు రాజశేఖరానికి ఓటును వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్లు శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, బీజేపీ నాయకులు మానేపల్లి అయ్యాజీ వేమ సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, దంతులూరి శ్రీను రాజు, మైపాల తాతాజీ, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, గుడాల పణి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించాలి

ముమ్మిడివరం: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీడీపీ నాయకులు కోరారు. ముమ్మిడివరం మండలం చినకొత్తలంక గ్రామంలో పట్టభద్రుల ఓటర్లను కలసి కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలని కోరారు. నమూనా బ్యాలట్ పత్రాన్ని అందించారు. ఈకార్యక్రమంలో పి.మల్లికార్జునవర్మ, పివీవీ.సత్యనారాయణ రాజు, పెద్దిరెడ్డి సత్యగోపాలకృష్ణ, గుత్తుల బుజ్జి, పి.సత్యనాగరాజు, పి.సీతారామరాజు, కె.నాగేంద్ర రాజు, పి.సత్యనారాయణరాజు, పి.చైతన్యవర్మ, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

అల్లవరం: టీడీపీ, జనసేన, బీజేపీ బలపరిచిన ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అల్లవరం హైస్కూలు, బండిగుప్తాపు సత్తిబాబు స్వగృహం వద్ద సమావేశాలు జరిపి పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. పెచ్చెట్టి బాబు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు ఎన్.సుబ్బరాజు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, గుబ్బల రాంప్రసాద్, కంకిపాటి వీరబాబు, కంకిపాటి గోపి, పచ్చిమాల ఏడుకొండలు, మంతెన సురేష్‌రాజు, గెద్దాడ శ్రీను, చిట్నీడి శ్రీనివాస్, ముత్యాల బాబి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి

మలికిపురం: ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాధ్యతలు అప్పగించిన ప్రతీ ఒక్కరు పేరాబత్తుల రాజశేఖర్ భారీ మెజార్టీతో విజయం సాధించడానికి పనిచేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కూటమి నాయకులు, ఎన్నికల కన్వీనర్ల సమావేశంలో వీరిద్దరూ మాట్లాడుతూ ఐదు రోజులు ఎన్డీఏ నాయకులు విశ్రమించకుండా పనిచేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు గ్రామానికి ఒకరు చొప్పున బాధ్యత తీసుకుని ఇతర ప్రాంతాల్లో ఓటర్లను గుర్తించాలని, ఓటర్లను స్వయంగా కలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కూటమి నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లిని దర్శించుకున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

ముమ్మిడివరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలోని సత్తెమ్మతల్లి జాతరమహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం నుంచి ప్రారంభమైన జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేకపూజలు జరిపించారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధూర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, తాడి నరసింహారావు, చెల్లి అశోక్, గంధం పల్లం రాజు, యాళ్ల ఉదయ్, దాట్ల బాబు, గాలిదేవర బుల్లిలతో పాటు పలువురు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయకమిటీ వారు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం రాత్రి నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కుమార్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో జబర్‌దస్త్ కామెడీషో, సంగీతా విభావరి విశేషంగా ఆకర్షించింది. సినీ గాయని, గాయకులు సాకేత్, శ్రీనివాస్, సత్య యామిని, వాగ్దేవి, రైజింగ్ రాజు, దొరబాబు, హరితలు ఆలపించిన గీతాలు ప్రేక్షకు లను ఉర్రూతలూగించాయి.


మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌మాధూర్, ఎమ్మెల్యే బుచ్చిబాబులకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరిస్తున్న దృశ్యం

మానవ మనుగడకు ప్రాణం మాతృభాష

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు మాతృభాష ప్రాణమని ప్రముఖ సాహితీవేత్త, ఆంధ్రోపన్యాసకుడు నల్లా నరసింహమూర్తి అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా భట్లుపాలెం ఏవీఎస్ఎన్ జూనియర్ కళాశాల, అమృత ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో శుక్రవారం మాతృభాషపై సదస్సు జరిగింది. తెలుగుభాష పరిరక్షణ, మనుగడ అంశంపై వక్తలు ప్రసంగించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ అడపా గోపి మాట్లాడుతూ మాతృభాషపై ప్రతిఒక్కరూ మమకారం పెంచుకోవాలని కోరారు. మాతృభాష పరిరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మధుర కృపానందం, అమృత ఇంగ్లీషు మీడియం స్కూల్ హెచ్‌ఎం నల్లా సరస్వతీదేవి, సింహాచలం, మోహన్, అనూష, విజయ, కళ్యాణి, మౌనిక, గాయత్రి, శ్యామల, హరితారాణి పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: వెత్సావారి అగ్రహారంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. అమలాపురం వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాతృభాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పి.భవ్య, ఎంవై సంయుక్త, టి.వంశీకృష్ణ ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. వారికి వాకర్స్ క్లబ్ బహుమతులు అందజేసింది. పాఠశాల హెచ్‌ఎం బందా ఆర్.కామేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారుల తెలుగు తల్లి వేషధారణలు ఆకట్టుకున్నాయి. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, ఉపాధ్యక్షుడు నూకల సత్యనారాయణ, వైఎస్ఎన్ మూర్తి, పట్నాల రమణ, కుడుపూడి త్రినాథ్, రావకొండ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ముమ్మిడివరంలో కళాసాహిత, లలిత కళలసేవ వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రవీంద్ర కాన్వెంట్లో విత్తనాల వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన మాతృభాష దినోత్సవ కార్యక్రమంలో విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు బి.సాంబమూర్తి పాల్గొని తెలుగు భాష పరిరక్షణ మాతృభాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వీవీఎస్ వర్మ, పొత్తూరి లక్ష్మీశ్రీనివాసన్, కవిశ్రీ నాగేంద్ర, ఏవీఎస్ మాస్టరు, గజ్జి శ్రీనివాసరావు, ఎస్.అబ్బులు, పి.విజయకుమార్, మట్టా శ్రీనివాసరావులతోపాటు పలువురు పాల్గొన్నారు.

ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యత కల్పించాలి

ఐ.పోలవరం: ప్రస్తుత ప్రపంచీకరణలో ప్రాంతీయభాషలు నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీటీఎం సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పలు సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాకపల్లి చిరంజీవి, ఎం.మూర్తిలను సన్మానించారు. అనంతరం క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. పుల్లెపు వెంకటేశ్వరరావు, విత్తనాల వరప్రసాదరావు, రేవు శ్రీనివాసరావు, నాగాబత్తుల రామకృష్ణ, సాధనాల బాబూరావు, నల్లా పవన్ పాల్గొన్నారు.

కుంగ్‌ఫూలో వీఆర్వోకు ప్రథమస్థానం


వీఆర్వో అబ్బులును అభినందిస్తున్న తహశీల్దార్ శ్రీపల్లవి

పి.గన్నవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఓపెన్ కరాటే టైక్వాండో కుంగ్‌ఫూ కత్తి ప్రదర్శన విభాగాలలో మండలంలోని వై.కొత్తపల్లి వీఆర్వో తాతపూడి అబ్బులు ప్రథమ స్థానం సాధించారు. ఇటీవల బాపట్ల జిల్లా అద్దంకి శ్రీసీతారామ కళ్యాణ మండపంవద్ద నిర్వహించిన ఓపెన్ కరాటే టైక్వాండో కుంగ్‌ఫూ జాతీయస్థాయి క్రీడాపోటీలలో ప్రతిభ కనబరిచినట్లు వీఆర్వో తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పి.శ్రీపల్లవి వీఆర్వోను అభినందించి మాట్లాడుతూ ఈ తరహా క్రీడలు మానసిక ఉల్లాసం, ఆరోగ్యంతోపాటు ఆత్మరక్షణకు దోహదం చేస్తాయన్నారు. డిప్యూటీ తహశీల్దార్ ఎం.సత్యనారాయణ, ఆర్ఐ వి.డాంగే, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు పి.నరసింహరావు, దొరబాబు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

చైతన్యరాజుకు ప్రముఖుల పరామర్శ


చైతన్యరాజును పరామర్శిస్తున్న ఎంపీ హరీష్‌మాధూర్, మాజీ మంత్రి రాఘవులు

అమలాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృ వియోగంతో బాధపడుతున్న కిమ్స్ విద్యా సంస్థల అధినేత కలిదిండి వీరవెంకటసత్యనారాయణరాజు(చైతన్యరాజు)ను శుక్రవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో చైతన్యరాజు తల్లి లక్ష్మీకాంతమ్మ భౌతికకాయానికి ఎంపీ గంటి హరీష్‌మాధూర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైతన్యరాజును మాజీ మంత్రులు గొల్లపల్లి సూర్యారావు, పరమట వీరరాఘవులు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, వాసా ఎస్.దివాకర్ తదితరులు పరామర్శించారు.

పైలట్ ప్రాజెక్టుపై సమీక్షా సమావేశం

యానాం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టిన దీన దయాళ్ జన్ ఆజీవిక్‌యోజన-పట్టణ ఉపాధి పథకంపై పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణలు సమీక్ష నిర్వహించారు. ఈ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన భవన నిర్మాణ, రవాణా కార్మికులు, కొరియర్ డెలివరీ బాయ్స్, ఇంటిపని చేసే వారు పారిశుధ్య కార్మికులు తదితర వృత్తులలో ఉన్నవారికి స్వయం సహాయక పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి రుణం అందించేందుకే ముఖ్యఉద్దేశం. పరిపాలనాధికారి ఆధ్వర్యంలో చర్చించారు. పరిపాలనాధికారి, మున్సిపల్ కమిషనర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్, సోషల్‌వెల్ఫేర్ ఆర్గనైజర్, లీడ్ బ్యాంకు మేనేజర్, లేబర్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ కమ్యూనిటీ ఆర్గనైజర్, సిటీ మిషన్ మేనేజర్‌లతో కూడిన కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

యానాం వెంకన్న ఉత్సవాలపై సమీక్ష

యానాం వెంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలకు సంబంధించి పరిపాలనాధికారి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, ఎస్పీ రాజశేఖరన్‌తోపాటు వివిధ శాఖల అధికారులు, ఉత్సవదారులు హాజరయ్యారు. మార్చి 1 నుంచి 23 వరకు జరిగే ఉత్సవాల ఏర్పాట్లుపై చర్చించారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన

యానాం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): యానాం మున్సిపల్ కార్యాలయం ఏదురుగా హెచ్ఆర్ స్వేర్ సంస్థ పారిశుధ్య కార్మికులు ఆందోళన చేశారు. సిబ్బందికి గత 11 నెలలుగా ప్రభుత్వం నుంచి జీతాలు చెల్లించడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమయానికి జీతాలు ఇవ్వకపోవడంతో జీవనం సాగించడం భారంగా ఉండటూ మున్సిపల్ శాఖ తీరుపై నినాదాలు చేశారు. దీనిపై మున్సిపల్ కమీషనర్ మాట్లాడుతూ ప్రతీనెలా బిల్లులను పుదుచ్చేరి ప్రభుత్వానికి పంపుతున్నామని ఎల్ఏడీలో వద్ద పెండింగ్ బిల్లులు ఉన్నాయని త్వరలోనే పూర్తవుతాయన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

అంబాజీపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మాచవరం పరిధిలోని పోతాయిలంకకు చెందిన ఓ వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. 49 సంవత్సరాల వయస్సు కలిగిన మట్టపర్తి వెంకటేశ్వరరావు ఈనెల 18వ తేదీ నుంచి కనిపించడంలేదని ఇంటి నుంచి వెళ్లే సమయంలో గులాబి కలర్‌షర్టు, నేవీ బ్లూ ప్యాంటును ధరించాడన్నారు. ఎత్తు 5 అడుగులు ఉంటాడన్నారు. వెంకటేశ్వరరావు కుమారుడు శ్రీరామమూర్తిదుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. యూటీఎఫ్ మాజీ సీనియర్ నాయకులు రెడ్డి వీరాస్వామి, నేరేడిమిల్లి అబ్బులు ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. గ్రాడ్యుయేట్ ఓటరులంతా పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులకు మొదటి ప్రాధాన్యత ఓటునువేసి గెలిపించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సకిలే సూర్యనారాయణ, వజ్రపు బాబాయ్, జి.దుర్గాప్రసాద్, మాదే శ్రీనిబాబు, అనుసూరి లక్ష్మణరావు, కాతి సురేష్, దొమ్మేటి వీరరాఘవులు, మహ్మద్ హసేన్‌తో పాల్గొన్నారు.

దొంగ హామీలు ఇచ్చి మోసం చేశారు

● మాజీ ఎంపీ హర్షకుమార్

పి.గన్నవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని మాజీ ఎంపీ హర్షకుమార్ విమర్శించారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజల్లోకి వచ్చిన ప్రభుత్వం ఒక్క హామీని నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటోలు ఉండేవని నెమ్మదిగా పవన్ కళ్యాణ్ ఫోటోను తీసివేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యవంతుడు జీవీ సుందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని హర్షకుమార్ కోరారు. నాయకులు కత్తుల విక్టర్‌బాబు, నెల్లి దుర్గాప్రసాద్, మంగం సురేష్, అనంతలక్ష్మి, జనార్ధనరావు, శ్యామ్యూల్,రమేష్ పాల్గొన్నారు.

దృష్టి లోపాలు ఉన్న విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేత

అమలాపురంటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పాఠశాలల్లో కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. వీరిలో దృష్టి లోపాలు ఉన్నవారిని గుర్తించి ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తున్నామన్నారు. అమలాపురం సూర్యనగర్ జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో 425మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించగా 27 మందికి దృష్టి లోపాలు ఉన్నట్టు గుర్తించి శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జేసీ ముఖ్యఅతిథిగా పాల్గొని కళ్లజోళ్లు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా అంధత్వ నివారణ సంస్థ ద్వారా 83,942 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 3300 మందికి దృష్టి లోపాలు ఉన్నట్టు గుర్తించారన్నారు. వారందరికీ ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తామన్నారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎ.హేమలత, డీఐసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.గీతిక, తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, హెచ్‌ఎం వి.విజయకుమారి, శిరీష పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్టైఫండ్ అవార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు స్పోర్ట్స్ స్టైఫండ్ అవార్డు కోసం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచామని, మార్చి 6 లోగా దరఖాస్తులను అందించాలన్నారు. వివరాలకోసం సెల్ 7993329433లో సంప్రదించాలన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతుల ఆందోళన

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయంవల్ల తమ చెరువులోని చేపలు చనిపోయాయంటూ ఎన్.కొత్తపల్లికి చెందిన రైతు శుక్రవారం రాత్రి ఉప్పలగుప్తం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశాడు. చనిపోయిన చేపలను సబ్‌స్టేషన్ వద్ద కుప్పగా పోసి తమకు సమాధానం చెప్పాలంటూ అధికారులను నిలదీశాడు. అయితే సదరు రైతు కనెక్షన్ డి లిస్టులో ఉందని, లోడు పెంపులో ఉన్నతాధికారుల ఆదేశాలతో పలువురి కనెక్షన్లు తొలగించామని ఏఈ శ్రీహరి తెలిపారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

అన్నక్యాంటీన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే


మండపేటలో భోజనం చేస్తున్న వేగుళ్ల

మండపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏడిదరోడ్డులో వున్న అన్నక్యాంటీన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సందర్శించారు. దీనిలో భాగంగా అక్కడకి వచ్చినవారితో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో మూతపడ్డ ఈ క్యాంటీన్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు తెరిపించడం ఆనందంగా ఉందన్నారు. రోజుకి ఎంతమంది వస్తున్నారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. శుచీశుభ్రత పాటిస్తూ నాణ్యమైన ఆహారం పేదలకు అందించాలని సూచించారు. ఈ విషయంలో రాజీపడొద్దన్నారు. ఆయనవెంట టీడీపీ నాయకుడు పాలచర్ల శిరీష్, తదితరులు వున్నారు.

తాత్కాలిక క్రాస్‌బండ్ పరిశీలన

రాయవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) మండలంలోని వెదురుపాక శివారు ప్రాంతంలో అనపాలమ్మ డ్రైన్‌పై నిర్మించిన తాత్కాలిక క్రాస్‌బండ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరిశీలించి పూజలు చేశారు. రామచంద్రపురం వాటర్‌డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, నదురుబాద ఎంపీటీసీ ఉండవిల్లి సుబ్బారాయుడు, పసలపూడి నీటిసంఘం డైరెక్టర్లు మల్లిడి అమ్మిరెడ్డి, నల్లమిల్లి అప్పారెడ్డి, పోతుల గంగాధర ప్రసాద్, ఉప్పలపాటి చంద్రరావు, వల్లు శ్రీనివాస్, తిర్రి శోభన్‌బాబు, కసిరెడ్డి వీరవెంకట సత్యనారాయణ, మిర్తిపాటి సూర్యనారాయణ, గరికపాటి సూర్యనారాయణ, ఇరిగేషన్ అధికారులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేస్తే కఠిన చర్యలు: కమిషనర్


వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎవరైనా రోడ్డుపై చెత్తవేస్తే కఠినచర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన శ్రీనగర్, బ్యాంక్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌లో భాగంగా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలాగే తడి, పొడిచెత్తను వేరుచేసే కార్యక్రమంలో వార్డుల వారీగా మెప్మా, సచివాలయ సిబ్బందితో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రోడ్డుపై టీ కప్పులను పడ వేసిన మీనాక్షి టీ స్టాల్ నిర్వాహకుడికి కమిషనర్ అపరాధ రుసుంను విధించారు. ఈయనవెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా సీఎంఎం సుజాత, శానిటరీసెక్రటరీ ఎం.సురేష్, తదితరులు ఉన్నారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోండి

రాయవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో లక్షా 27 వేల మంది రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 80,089 మంది నమోదు చేసుకున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి వీ.బోసుబాబు తెలిపారు. శుక్రవారం రాయవరం మండలం పసలపూడిలో జరుగుతున్న నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆలమూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కె.నాగేశ్వరరావు, ఏవో కె.ప్రభాకర్, గ్రామ విస్తరణ అధికారి శివశంకర్, గ్రామ వ్యవసాయ సహాయకులు , తదితరులు ఉన్నారు.

ద్రాక్షారామ: రైతులు ఈనెల 25లోగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వి.బోసుబాబు కోరారు. రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో రైతు సేవాకేంద్రంలో నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఏడీఏస్ రంగారావు, ఏవో ఎన్.సత్యప్రసాద్, వీవోఏ పి.రేవతి, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా విజయదుర్గమ్మ జాతర

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి) : అంగర చేనేత సొసైటీ సమీపంలో కొలువైనవిజయదుర్గమ్మ జాతరను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరగనృత్యాలు, విచిత్ర వేషాలు, తీన్‌మార్ వాయిద్యాలు, బాణసంచాలతో ఊరేగించారు. శనివారం ఆలయం వద్ద తీర్థం, ఆదివారం నైవేద్యాలతో జాతర మహోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ తెలిపింది.

ఇష్టపడి చదివితే ఒత్తిడి దూరం

ద్రాక్షారామ,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదివితో ఒత్తిడి దూరమవుతుందని రాజమహేంద్రవరం విశ్రాంత వైద్యాధికారి, సైకాలజిస్ట్ అసోసియేషన్ ముఖ్యసలహాదారు డాక్టర్ ఎంవీఆర్ మూర్తి అన్నారు. శుక్రవారం ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాలలో పీఎంపీ అసోసియేషన్ రామచంద్రపురం మండలం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం సీహెచ్ రత్నపద్మావతి, పీఎంపీ అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు, సభ్యురాలు జమీల, ఎస్‌ఎంసీ చైర్మన్ కె.నాగజ్యోతి, వైస్ చైర్మన్ మాణిక్యాంబ, ఉపాధ్యాయులు అరవ విస్సు, జీవీఎస్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిని గెలిపించాలి


కేశవరంలో ప్రచారం చేస్తున్న పార్టీ పరిశీలకుడు రాజారపు మహేష్


సమావేశంలో మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, అభ్యర్థి పేరాబత్తుల, తదితరులు

మండపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రాజారపు మహేష్ కోరారు. శుక్రవారం స్థానిక కూటమి నేతలతో కలిసి కేశవరం, ద్వారపూడిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు యరగతపు బాబ్జీ, కర్రి తాతారావు, ఉండమట్ల శ్రీను, ఆళ్లరాజు, కంటిపూడి గంగాధరం, కూసు సత్యనారాయణ, గుండ్ల ఈశ్వరరావు, గోణం పుల్లయ్య, సత్తి సత్యనారాయణ, సలాదిబాలసుబ్రహ్మణ్యం, టీ.మురళీకృష్ణ, చింతా దొరబాబు, పల్లబాబు, తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ:కూటమి ఎనిమిది నెలల పాలనకు ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు రెఫరెండంగా భావిస్తున్నామని మంత్రి సుభాష్ అన్నారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని మంత్రి, ఎంపీ హరీష్‌మాధుర్ పిలుపునిచ్చారు. శుక్రవారం రామచంద్రపురం లయన్స్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ పట్టభద్రుల ఓటర్ల సమావేశంలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడారు. సమావేశంలో సీనియర్ టీడీపీ నాయకులు, పరిశీలకులు గన్నికృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, దళిత సంఘాల నాయకులు రవ్వాభూషణం, కాటే సుబ్రహ్మణ్యం, సిర్రా సురేష్, ఆకుమర్తి చిన్న, కొత్తపల్లి అరుణ, సీనియర్ టీడీపీ నాయకులు, పరిశీలకుడు గన్నికృష్ణ, కాకినాడ రామారావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పేరాబత్తుల విస్తృత ప్రచారం

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపును కోరుతూ మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌మాధుర్ శుక్రవారం రామచంద్రపురం పట్టణంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో వారిద్దరు పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ ఉపాధ్యక్షుడు వి.కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అంపోలు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే ఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌తో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో జరిగింది. దీనిలో భాగంగా అంగర, పడమరఖండ్రికల్లోని జడ్పీ ఉన్నత పాఠశాల, పీహెచ్‌సీల్లో అమలాపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఓటర్లను కలిసి రాజశేఖరానికి ఓటువేసి గెలిపించాలని కోరారు. అలాగే కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, కూటమి నాయకులతో కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీడీపీ నాయకులు కోరారు. శుక్రవారం వెదురుపాకలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ వైఎస్ ఎంపీపీ సత్తి హిమరాణి సావిత్రిదేవి మాట్లాడుతూ పట్టభద్రులంతా పేరాబత్తులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం గ్రామంలోని పట్టభద్రులను కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, గ్రామశాఖ అధ్యక్షుడు కొవ్వూరి చంటిరెడ్డి, టీడీపీ సీనియర్ నేతలు కొవ్వూరి నాగిరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, కటారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌కు అఖండ మెజార్టీతో విజయాన్ని అందించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాయవరంలో ఆయన కూటమి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మెన్ ఉండవిల్లి రాంబాబు, కూటమి నేతలు సేత కర్రి వెంకటరెడ్డి, నల్లమిల్లి రమేష్‌రెడ్డి, మల్లిపూడి చిన్న, మూర్తినీడి శ్రీనివాస్ చౌదరి, వల్లూరి శ్రీనివాస్‌చౌదరి, దేవిశెట్టి కోటేశ్వరరావు, కరుణ్‌కుమార్, నేతల సురేష్, కామన సురేష్, రొంగల అప్పారావు, తదితరులు ఉన్నారు.

వృద్ధులకు అన్నదానం

మండపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛాంధ్ర సంస్థలో వృద్ధులకు ఆలమూరు ఆర్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు మాదేకృపావరం, మాదేప్రసాదరావు తమ మాతృమూర్తి మాదేలక్ష్మమ్మ పేరిట అన్నదానం చేశారు. అనంతరం పేదలకు పండ్లను పంపిణీ చేశారు. ట్రస్టు నిర్వాహకులు, దాసి రాంజీ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ద్రాక్షారామ,ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ బీ.రఘువీర్ శుక్రవారం పరిశీలించారు.

'ఆధునిక సాహిత్య అధ్యయనంతో వాక్చాతుర్యం'


మురళీకృష్ణను సత్కరిస్తున్న అధ్యాపకులు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాహిత్యం అధ్యయనం ద్వారా ఎదుటివారికి ఆసక్తి కలిగే మాట్లాడే సామర్థ్యం వస్తుందని ప్రముఖ వైద్యుడు యనమదల మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. ఎస్.లక్ష్మీ మాతృభాషా దినోత్సవం ప్రాధాన్యత గురించి వివరించారు. తెలుగుశాఖ అధ్యాపకురాలు డా. సుజాత, హిందీ విభాగం అధ్యక్షుడు డా. వెంకట రమణ, ఇంగ్లీషు విభాగం అధ్యక్షుడు బేగం, తెలుగు అధ్యాపకుడు ప్రభాకర్, చలం, డిగ్రీ విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవం

మండపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనం, ఆవశ్యకత గురించి ప్రిన్సిపాల్ కేటీటీవీ శ్రీనివాసరావు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో తెలుగు భాషా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు


ఎంపీఎస్ పాఠశాలలో మాట్లాడుతున్న పట్టణ సీఐ సురేష్

మండపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ దారం సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు నేరాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా గ్రామపంచాయతీ అధికారి (డీపీవో) డీ. శాంతలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆమె కపిలేశ్వరపురంలో చెత్త నుంచి సంపద తయారీ చేస్తున్న కేంద్రాన్ని తనిఖీ చేశారు. దీనిలో భాగంగా పంచాయతీ కార్యదర్శి కె.శివచక్రవర్తి, డ్వాక్రా యానిమేటర్లు, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రులకు తడి, పొడి చెత్త వేరు చేసే విధానం, తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, డ్వాక్రా యానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

మండపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) మండపేట పట్టణానికి చెందిన దళిత మహిళ ఇంటిలోకి ప్రవేశించి కులం పేరుతో దూషించాడంటూ బాధిత మహిళ ఈనెల 17న పట్టణ పోలీసుస్టేషన్‌లో చేసిన ఫిర్యాదుపై రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ శుక్రవారం విచారణ చేశారు. సాయినగర్‌కు చెందిన అప్పలబత్తుల వినయ్‌క్రాంత్ గొల్లలగుంటకు చెందిన మహిళ రంపల లలితాదేవి తన ఇంటిలోకి ప్రవేశించి తనను కులం పేరుతో దూషించాడంటూ చేసిన ఫిర్యాదు చేసింది. పట్టణ సీఐ దారం సురేష్ వున్నారు.

విజయసుందర్‌ను గెలిపించండి

ద్రాక్షారామ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జి.విజయసుందర్‌ను గెలిపించాలని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కోరారు. శుక్రవారం రామచంద్రపురం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. యర్రా రామకృష్ణ, ఇసుకపట్ల శ్యామల, కొల్లపు కామేశ్వరరావు పాల్గొన్నారు.

239 పాఠశాలల్లో సైన్స్ క్విజ్


గంగవరంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న సుబ్రహ్మణ్యం

జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం

కె.గంగవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 239 పాఠశాలల్లో 8,9 తరగతులు విద్యార్థులు సైన్స్ క్విజ్‌కు హాజరైనట్టు జిల్లా సైన్స్ అధికారి జీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఆయన క్విజ్‌కు సంబంధించిన ప్రశ్నాపత్రాలను ఓపెన్ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 239 ఉన్నత పాఠశాలల నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు చొప్పున 478 మంది, 239 ఉన్నత పాఠశాలలు, 60 ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు 576 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ప్రతి మండల కేంద్రంలోను మండల స్థాయిలో ఈ క్విజ్ నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. అక్కడ విజయం సాధించిన విద్యార్థులకు ఈనెల 25న అమలాపురంలో జిల్లా స్థాయిలో క్విజ్ నిర్వహించి, విజేతలకు 28న జాతీయ విజ్ఞాన దినోత్సవం రోజున నిర్వహించే సైన్స్ సంబరాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. కె.గంగవరంలో జరిగిన క్విజ్ పరీక్షలను సుబ్రహ్మణ్యం పరిశీలించారు.

రావులపాలెం: స్థానిక జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన మండల స్థాయి సైన్సు క్విజ్ పోటీల్లో 9వ తరగతి నుంచి టి.సుబ్రహ్మణ్యం ప్రథమ, టి.నిహారిక ద్వితీయ, 8వ తరగతి నుంచి కె.తరుణ్ ప్రథమ, ఎ.జయశ్రీ ద్వితీయ స్థానాలు సాధించినట్టు ఎంఈవోలు ఆర్.నాగరాజు, బి.శ్రీనివాసరాజు తెలిపారు. వీరు ఈనెల 25న జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

కూటమి అభ్యర్థిని గెలిపించండి


రావులపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. స్థానిక ఇందిరాకాలనీలో ప్రచారం నిర్వహించారు. నాయకులతో కలిసి పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో గుత్తుల పట్టాభిరామారావు, వడ్లమూడి రామారావు, కోట వెంకటేశ్వరరావు, సిద్ధిరెడ్డి శ్రీను, పడాల బుల్లికొండారెడ్డి పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలసి నమూనా బ్యాలెట్ పత్రాన్ని అందించారు. రాజశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లంక వరప్రసాద్, సూరపురెడ్డి సత్య, ఎస్‌జేపీ నారాయణ, గారపాటి శ్రీనివాస్, తోట వెంకటేశ్వరరావు, పడాల అమ్మి రాజు, బైరిశెట్టి రాంబాబు పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌ను పరిశీలించిన డీఎస్పీ

కె.గంగవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు కె.గంగవరం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్‌లను డీఎస్పీ బి.రఘువీర్ శుక్రవారం పరిశీలించారు. ఎస్ఐ ఎస్‌కే జానీబాషాను వివరాలు అడిగి తెలుసుకున్నారు.డీఎస్పీ వెంట రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ ఉన్నారు.

ప్రతిభకు పట్టం కట్టేది కూటమి ప్రభుత్వమే

టీడీపీ నాయకులు

రావులపాలెం,ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రతిభ, అర్హతలు ఉన్నవారికి పెద్దపీట వేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని దానికి నిదర్శనమే యూనివర్శిటీల కులపతుల నియామకాలు అని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. రావులపాలెంలోని టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నాయకులు ముత్యాల బాబ్జి, కాసా సాగర్, మాసాబత్తుల ఆనందరావు మాట్లాడారు. పగలు, ప్రతీకారాలతో జగన్ గతంలో పాలన సాగించారని, ఇప్పుడు ప్రతిపక్ష హోదా పేరుతో సొంత ఎమ్మెల్యేలను కూడా అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారన్నారు. జగన్ వైఖరిని అర్థం చేసుకుని ఇప్పటికైనా ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చి ప్రజలు అప్పగించిన బాధ్యతలు నెరవేర్చాలన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు రేపే గడువు


దంగేరులో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న బోస్‌బాబు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి బోసుబాబు

కె.గంగవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తున్న రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పీఎం కిసాన్ లబ్ధిదారులు ఈనెల 23లోగా పూర్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఓలేటి బోసుబాబు అన్నారు. శుక్రవారం ఆయన కె.గంగవరం మండలంలోని దంగేరు, కోటిపల్లి రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. పీఎం కిసాన్ 19వ విడత నిధులు ఈ నెల 24 విడుదల అవుతున్నట్టు ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నుంచి అమలయ్యే ఏ పథకానికైనా ఈ గుర్తింపు సంఖ్యే ప్రామాణికం కానున్నందున రైతులు వేగంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రబీ పంట ఈ-క్రాప్ నమోదు పురోగతిని పరిశీలించారు. రబీ పంట ఈకేవైసీ ఈ నెల 25లోపు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు సబ్సిడీపై డ్రోన్‌లు ఇచ్చి, వారికి శిక్షణ ఇస్తామని చెప్పారు. కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏవో బలుసు రవి, సహాయకులు శ్రీరామ చంద్రమూర్తి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులతో జరిగిన సమావేశంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర పథకాలు అందుతాయన్నారు. ఈ నెల 2 నుంచి నమోదు ప్రక్రియ జరుగుతుందని, 25తో ముగుస్తుందన్నారు. మండలంలో 5442 మందికి రైతులకు గాను ఇప్పటి వరకూ 2940 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, మిగిలిన రైతులు రైతు సేవాకేంద్రాలకు వచ్చి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

మాతృభాషను పరిరక్షించుకుందాం

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంలో వక్తలు


ఆలమూరు గరల్స్ హైస్కూల్లో మాతృభాష దినోత్సవ ర్యాలీ

ఆలమూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మాతృభాషతోనే తెలుగుజాతి మనుగడ సాధ్యమవుతుందని పలువురు వక్తలు అన్నారు. మాతృభాషను పరిరక్షించుకునే బాధ్యత అందరిపైన ఉందన్నారు. స్థానిక జడ్పీ గరల్స్ హైస్కూల్లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం బాలమందిరం వ్యవస్థాపకుడు కృష్ణశ్రీ అధ్వర్యంలో జరిగాయి. ఈ సభకు ప్రముఖ కవులు కృష్ణశ్రీ, కామవరపు గౌరి మల్లిక్, పుస్తక ప్రచురణకర్త తురగా కృష్ణకుమార్ విచ్చేసి ప్రసంగించారు. బెంగాలీ విద్యార్థుల పోరాటం, వారి త్యాగాల వల్ల అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఏర్పడిందని వివరించారు. విద్యార్థి దశలోనే తల్లి భాషపై పట్టు పెంచుకోవడం, మాట్లాడటం ద్వారా మన జాతి పరిరక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెత్సా లక్ష్మణరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మడికి, చింతలూరు ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం


స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు దంపతులు, కల్పవృక్ష వాహనంపై వేంకటేశ్వరస్వామి



- ముత్యాల పందిరిలో వేంకటేశుడు
- శాస్త్రోక్తంగా చక్రస్నానం
- పలుచోట్ల ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ఆలమూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): చింతలూరు వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం ఐదోరోజు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్లకు సుప్రభాత సేవ, తోమాల సేవతోపాటు వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం చక్రస్నానం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీవారిని కల్పవృక్ష ముత్యాల పందిరి వాహనంపై ఉంచి గ్రామ పురవీధుల్లో మేళాతాళాలు, కోలాటం, భక్తమండలి సంకీర్తలు నడుమ వైభవంగా ఊరేగించారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వార్లకు దివ్య శాంతి కల్యాణం నిర్వహించారు. వేదపండితుడు వాడపల్లి గోపాలాచార్యులు అధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. కాగా వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు జరిపి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు అల్లంరాజు భరణి, ద్విభాష్యం కాశీవిశ్వనాథశర్మల అధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కోటిపల్లిలో భారీ అన్నసమారాధన

కె.గంగవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి గౌతమీ గోదావరి పాత రేవులో భీష్మఏకాదశి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అగ్నికుల క్షత్రియుల సహకారంతో భక్తాంజనేయ ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాతకోటలో రామనామ సప్తాహం

మండలంలోని పాతకోట గ్రామంలో లోపాముద్రాదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో 5వ వార్షిక అఖండ రామనామ సప్తాహం నిర్వహిస్తున్నారు.వడ్లమూడి సుబ్బారావు, సునీత దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ధాన్యలక్ష్మి ప్రతిష్ఠ పూజలు

కె.గంగవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం-కోటిపల్లి రోడ్డులోని కోట గ్రామ పరిధిలో నిర్మిస్తున్న ధాన్యలక్ష్మి అమ్మవారి నూతన ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం భక్తులు 101 కావిడలతో కోటిపల్లి గోదావరి నది నుంచి పవిత్ర జలాలను తీసుకువచ్చి పూజలు చేశారు.కార్యక్రమాల్లో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


ధాన్యలక్ష్మి అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న మంత్రి సుభాష్, ఎంపీ హరీష్

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

రావులపాలెం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివిస్ లేబరేటరీస్, బలక్ డ్రంక్ కంపెనీ ప్రతినిధులు జాబ్ మేళా నిర్వహించారు. దీనికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫార్మసీ, కెమిస్ట్రీ అభ్యర్థులు పాల్గొన్నారు. వారికి రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు వారం రోజుల్లో ఎంపిక పత్రాలు అందజేస్తామని దివిస్ లేబరేటరీస్ హెచ్‌ఆర్ సీహెచ్ పూర్ణహరిప్రసాద్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ యు.రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేకేసీ కో ఆర్డినేటర్ కె.రజనీ, ఎస్.అరుణ్‌కుమార్, సుభాషిణి, సిద్ధార్థ, సుందర్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపు

మూడు లారీల సీజ్.. జరిమానా

రావులపాలెం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా బొండు మట్టిని తరలిస్తున్న మూడు లారీలను సీజ్ చేసినట్టు తహశీల్దారు ముక్తేశ్వరరావు తెలిపారు. మండల స్థాయి టాస్క్‌ఫోర్ ఆధ్వర్యంలో రావులపాలెంలో తనిఖీలు నిర్వహించామన్నారు.. దీనిలో భాగంగా అక్రమంగా బొండు మట్టిని తరలిస్తున్న మూడు లారీలను అదుపులోకి తీసుకుని జరిమానా విధించామన్నారు. అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. దాడుల్లో సుజాత, రవికుమార్, రవిశంకర్ పాల్గొన్నారు.

శ్రీవారికి పంచామృతాభిషేకం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందమాలధారులు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. గురుస్వామి ఖండవిల్లి సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో గోవింద నామ స్మరణతో ప్రత్యేక పూజలు జరిపి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు.